క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటి 8వ తరగతికి చెందిన జి.రోహిత, 9వ తరగతి విద్యార్థిని టి.స్వాతిలను పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థినులు ఈనెల 26న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లోనూ ప్రతిభ చాటి పాఠశాల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లో, క్విజ్ లాంటి పోటీల్లోనూ రాణించాలని కోరారు.

'ఫోరం' మండల అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి



దుగ్గొండి : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా మండలంలోని గిర్నిబావికి చెందిన సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు ఆరె జైపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తనకు పదవి రావడానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్, మహిళా ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

'తోటి' సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

నర్సంపేట రూరల్ : మండలంలోని మాదన్నపేటలో ఆదివాసీ తోటి తెగకు చెందిన నాయకులు ఏర్పాటు చేసిన సేవా సంఘం గ్రామ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సోమ సారయ్య, షడ్మకి గోవిందు, ముఖ్య సలహాదారుగా ఆకుల వీరస్వామి, అధ్యక్షులుగా ఆకుల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా గుర్రం రవి, కోశాధికారిగా ఆకుల ప్రశాంత్, ఆకుల యాదగిరి, ప్రచార కార్యదర్శిగా ఆకుల రాజశేకర్, కార్యవర్గ సభ్యులుగా సోమ రవి, ఆకుల వెంకటస్వామి, ఆకుల రాజేందర్, ఆకుల శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

సోదరుడిపై దాడి

నర్సంపేట రూరల్ : అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటన నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇటుకాలపల్లికి చెందిన బుర్ర వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన అతడి సోదరుడు శ్యాంసుందర్ కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు తలకు గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంకటేశ్వర్లును స్థానికులు చికిత్స కోసం 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంకటేశ్వర్లును వైద్యులు వరంగల్‌లోని ఎంజీఎంకు రెఫర్ చేశారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చంద్రయ్యపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డమీది చేరాలు కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో చేరాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను 108లో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండెబోయిన రమేశ్, కందుల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి బాధితుడిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవుకు..



సంగెం : ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవుకు గాయాలైన ఘటన మండలంలోని కాపులకనపర్తిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాపులకనపర్తికి చెందిన రైతు చాత్ల కిశోర్ సాకుతున్న ఆవును గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద అన్నారం నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆవు తుంటి విరిగి తీవ్ర గాయాల పాలైంది. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఆవు గాయాలపాలైందని గ్రామస్తులు మండిపడ్డారు. రైతు ఫిర్యాదుతో పోలీసులు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేయండి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం : రైతు శ్రేయస్సే లక్ష్యంగా సహకార సంఘాల పాలకవర్గం, సిబ్బంది పని చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. సంగెం మండలంలోని కాపులకనిపర్తి, సంగెం, గీసుకొండ మండలంలోని ఊకల్ సొసైటీల్లో పాలక మండలి, అధికారులతో గురువారం సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించి సాగులో యాంత్రీకరణ పెంచాలని పేర్కొన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తే స్వదేశంతోపాటు విదేశాల్లోను పంట ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు గోదాం అవసరం ఉంటే ఫైనాన్స్ ఏజెన్సీల ద్వారా సొసైటీ గోదాం నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. సంగెం సొసైటీకి గోదాంల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం గుర్తించి తీర్మానం చేస్తే కలెక్టర్‌తో మాట్లాడి సమకూర్చుతామన్నారు. సొసైటీ చైర్మన్లు సంపత్ గౌడ్, కుమారస్వామి, రమేశ్, డీసీఓ నీరజ, జేడీఏ అనురాధ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్, తహసీల్దార్లు రాజ్‌కుమార్, రియాజుద్దీన్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో రూ.1.70 కోట్లతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న గిరిజన పోస్ట్ మెట్రిక్ బాలుర హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఊరికి దూరంగా చెట్ల పొదల మధ్య నిర్మించిన ఆ భవనాన్ని ట్రైబల్ వేల్ఫేర్ జిల్లా అధికారి సౌజన్యతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్‌ను ఓగ్లాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ బాయ్స్ హాస్టల్‌కు తరలించాలని కోరారు. హాస్టల్‌కు శ్మశానవాటిక పక్క నుంచి కాకుండా రైతు వేదిక, కేజీబీవీ వెనక నుంచి దారి తీయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, సర్వేయర్ సదయ్య, నాయకులు జనగాం రమేశ్, హరిబాబు, మెట్టుపల్లి రమేశ్, కిశోర్ నాగరాజు, పాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి



మాట్లాడుతున్న మేనేజర్ నరేశ్‌కుమార్

ఖానాపురం : ఆర్థిక అక్షరాస్యతతో వ్యక్తుల అభివృద్ధి సాధ్యమని ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ నరేశ్‌కుమార్, లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీసీ కౌన్సిలర్ భాస్కరాచారి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీఈఏ ఫండ్ స్కీమ్ సహకారంతో ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'ఆర్థిక అక్షరాస్యత–సైబర్ నేరాలు' అంశంపై గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. సంపాదించిన డబ్బులో కొంత భాగాన్ని సరైన రీతిలో పొదుపు చేసుకుని ఆర్థికంగా బలపడడమే ఆర్థిక అక్షరాస్యతగా అభివర్ణించారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పెంచుకోవాలని సూచించారు. బ్యాంక్ ఖాతాదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే సరైన సిబిల్ స్కోర్ ఉండాలని తెలిపారు. మొబైల్ బ్యాంకింగ్‌తో సేవలు మరింత సులభతరమయ్యాయని వివరించారు. సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేలా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను బాధితులు వినియోగించుకోవాలని కోరారు. ఓటీపీ, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవాలని తెలిపారు. సదస్సులో సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి, కోఆర్డినేటర్లు ముబీన్ ఖాన్, ఈదునూరి రమేశ్, బ్యాంక్ మిత్ర అనిత, సంధ్య, సౌజన్య, శ్వేత పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం



చెరువులోకి చేపపిల్లలను వదులుతున్న మునిత, నాయకులు

రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఊగ మునిత, మాజీ సర్పంచ్ రెంటాల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అందించిన చేపపిల్లలను మండలంలోని పెర్కవేడులోని దేవుని చెరువు, రాగన్నగూడెంలోని నాగిరెడ్డి చెరువులో వారు గురువారం వదిలి మాట్లాడారు. మత్స్యకారులు ఆర్థిక అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను అందిస్తోందని తెలిపారు. మత్స్యకారులు చేపపిల్లల పెంపకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు తీగల సాయిలు, సుతారి యాదగిరి, ఊగ ఉప్పలయ్య, మత్స్య శాఖ అధ్యక్షుడు షాపురం సాయిలు, ఊగ పెద్ద ఉప్పలయ్య, ఊగ నర్సయ్య, వేల్పుల యాకయ్య, పాల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే షురూ



సర్వే చేస్తున్న ఏఈఓ, అధికారులు

సంగెం : సంగెం, గీసుకొండ మండలాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పంటల డిజిటల్ సర్వే గురువారం మొదలైంది. ఈ సందర్భంగా ఏఓ హరిప్రసాద్ మీడియాతో మాట్లాడారు. అన్ని కమతాల్లోనూ పంటను ఫొటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన డిజిటల్ సర్వేలో పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని ఆయన చెప్పారు. గత సీజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన మండలాల్లో కొన్ని వారాలుగా ఏఈఓలు సర్వేను నిరసిస్తూ మొదలు పెట్టలేదని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ అదేశాల మేరకు సమ్మె విరమించి డీసీఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని సర్వే ప్రారంభించామని తెలిపారు. ఒకే సీజన్‌లో ఏఈఓ 5 వేల ఎకరాల్లో పంట నమోదును నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేయడం కష్టమన్నారు. గ్రామాలకూ దూరంగా రహదారి సైతం లేని ప్రాంతాల్లో సర్వే చేసే సమయంలో మహిళా ఏఈఓల భద్రత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామాల వారీగా క్షేత్ర సహాయకులను కేటాయించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు రజని, కావ్య, స్మిత, అఖిల, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు భగవద్గీత గ్రంథాల బహూకరణ



చెన్నారావుపేట : కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యారెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణిలకు త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాష్ ఆచారి గురువారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు, క్యాలెండర్లు బహూకరించారు. తొలుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాల అమలును పరిశీలించే క్రమంలో సుబ్రహ్మణ్యారెడ్డి, శ్రీవాణి శ్రీ కృష్ణ సత్సంగం హాల్‌ను సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు సాయిరాజ్, రావన్‌చారి, నిర్మల, కార్యదర్శి అవినాశ్, ఉద్యోగి విక్రమాచారి పాల్గొన్నారు.

సురక్షితమైన నీరందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ట్రెయినర్ సూరజ్

చెన్నారావుపేట : ప్రజలకు సురక్షితమైన తాగునీరందించేలా నీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇంట్రా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) రణధీర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నీటి సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణ గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఏఈఈ రణధీర్ మాట్లాడారు. నీటి సహాయకులు నీటి నాణ్యత పరిశీలన, పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తొలుత ట్రెయినర్ సూరజ్ నీటి నాణ్యతను పరిశీలించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో గ్రిడ్ ఏఈఈ వంశీ, ఎంపీఓ శ్రీధర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపుపై కేసు



పర్వతగిరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలపారు. ఆయన కథనం ప్రకారం.. రోళ్లకల్, చెరువుముందుతండాకు చెందిన కొందరు ట్రాక్టర్లలో సంగెం మండలం దిశగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని తురకల సోమారం శివారు సాయిబాబా ఆలయం వద్ద ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సబ్‌మార్కెట్ యార్డు ఆధునికీకరణకు సర్వే



సర్వే చేస్తున్న ఏజెన్సీ బాధ్యులు

ఖానాపురం : మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డు ఆధునీకరణ దిశగా ప్రైవేట్ ఏజెన్సీ బాధ్యులు గురువారం సర్వే చేపట్టారు. మార్కెట్ యార్డును చైర్మన్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ హరిబాబు, పాలకవర్గ సభ్యులు ఇటీవల సందర్శించి పేరుకుపోయిన సమస్యలను గుర్తించారు. సీసీ రోడ్లతోపాటు బెడ్‌లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించింది. దీంతో ఏజెన్సీ బాధ్యులు మార్కెట్‌లో సర్వే పనులు చేపట్టారు. మార్కెట్ అధికారుల ఆదేశాల మేరకు సర్వేయర్ రమేశ్‌రెడ్డి సర్వే చేశారు. అధికారులకు నివేదిక అందస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఉద్యోగి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉద్యోగ అవకాశాలు



సర్వే చేస్తున్న ఈజీఎంఎం ట్రెయినర్, తదితరులు

ఖానాపురం : త్వరలో జాబ్‌మేళా ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు డీఆర్‌డీఏ ఈజీఎంఎం ట్రెయినర్ మొగిలి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సీసీలు, మహిళా సంఘాల బాధ్యులతో కలిసి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మొగిళి మాట్లాడారు. గ్రామాల్లో నిరుద్యోగ యువత గణాంకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువత గణాంకలు సేకరించి త్వరలో జాబ్‌మేళా నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు సునీత, శ్రీదేవి, భవాణి, శ్రీలత, హంస, యాకూబీ, లత, లక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దుగ్గొండి : మండలంలోని పొనకల్‌లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్థానిక, టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన రెడ్డబోయిన కుమారస్వామి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

ఓంకార్ ఆశయాలు కొనసాగిస్తాం



ఓంకార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ ఆశయాలను కొనసాగిస్తామని ఆ పార్టీ నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి తెలిపారు. నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లిలో ఓంకార్ 16వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడారు. ఓంకార్ నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని తెలిపారు. ప్రజాపోరాటాలే ఓంకార్‌కు నిజమైన నివాళి అని చెప్పారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఓంకార్ స్ఫూర్తితో పోరాటాలు నిర్మిస్తామని వివరించారు. తొలుత ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కౌెట్టి సదానందం, అనుమాల రమేశ్, గుర్రం రవి, జవాజి చంద్రమౌళి, నర్సింహస్వామి, చంద్రమౌళి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'ఎర్రబెల్లి' అండ



విద్యార్థినికి నగదు అందజేస్తున్న నాయకులు

రాయపర్తి : ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అండగా ఉంటారని ఆ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి రమేశ్ తెలిపారు. మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన పేద విద్యార్థిని బాలె రమ్య ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా ఆమెను ప్రోత్సహించేందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పంపించిన రూ.10 వేల నగదును రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం అందజేశారు. తొలుత విద్యార్థినిని నాయకులు అభినందించారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమ్య ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని చెప్పారు. ఎంబీబీఎస్‌లో ప్రతిభ చాటి భవిష్యత్‌లో మరింత ఉన్నత అవకాశాలు పొందాలని సూచించారు. పేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ, నాయకులు తోడ్పాటు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముంజాల రవీందర్‌గౌడ్, గోనె శ్రీను, తాళ్లపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

'నో డ్యూ'కు డబ్బులు తీసుకోవడం సరికాదు

చెన్నారావుపేట : రుణాలు తీసుకునేందుకు కోసం అవసరమైన నో డ్యూ సర్టిఫికెట్ జారీ కోసం అమీనాబాద్ సొసైటీలో రూ.100 చొప్పున ఫీజు తీసుకోవడం సరికాదని జోజిపేట నారాయణ తండాకు చెందిన రైతు సురేష్ అన్నారు. బ్యాంకుల్లో ఉచితంగా ఇస్తుండగా పీఏసీఎస్‌లో ఎందుకు తీసుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

నివాళి

నర్సంపేట : మండలంలోని మాదన్నపేట రోడ్డులోని సీపీఐ కాలనీకి చెందిన సీపీఐ మండల సమితి సభ్యుడు, అఖిల భారత యువజన సమైక్య జిల్లా నాయకుడు మొంద్రాతి రవి డెంగ్యూతో గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయసారథి, రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. రవి మృతి పార్టీకి, ప్రజాసంఘాలకు, ప్రజలకు తీరని లోటన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేశ్, జిల్లా సమితి సభ్యులు గడ్డం యాకయ్య, మియాపురం గోవర్ధన్, కందిక చెన్నకేశవులు, పాలక కవిత, నాయకులు గడ్డం నాగరాజు, బాదరపోయిన యాదగిరి, పిట్టల సతీశ్, వడ్లకొండ స్వామి, దండుగుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మహబూబ్ పాషాకు వైద్యం కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం రూ.10 వేల సాయం అందజేశారు. మహబూబ్ పాషా బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయి కొద్ది రోజులుగా హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. మహబూబ్ పాషా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 నగదు అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పరామర్శ



నర్సంపేట రూరల్ : మండలంలోని ముత్తోజిపేటలో శంషొద్దీన్ సతీమణి సుల్తానా మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం పరామర్శించారు. ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో శంషొద్దీన్, సుల్తానా గాయాలపాలు కాగా చికిత్స పొందుతూ సుల్తానా మృతి చెందింది. ఈ క్రమంలో ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించగా ఎమ్మెల్యే చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

జేతురాంతండాలో..

రాయపర్తి : మండలంలోని జేతురాం తండాకు చెందిన గుగులోతు చందు నాయక్ గురువారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పరామర్శించారు. తొలుత చందు నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొలన్‌పల్లి గ్రామంలో కాడబోయిన మల్లయ్య, రాయపర్తిలో అల్లాడి చంద్రమౌళి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి కలిసి పరామర్శించారు. కార్యక్రమాల్లో సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు మాచర్ల ప్రభాకర్, కృష్ణారెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, గోవర్ధన్ రెడ్డి, చిర్ర మల్లయ్య, మచ్చ నీలయ్య, నర్సింహమూర్తి, అఫ్రోజ్, మచ్చ రమేశ్, గారె భిక్షపతి, ఎల్లారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో బొమ్మెర కుమారస్వామి, కొత్తూరులో ఆకారపు ఉపేంద్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పెర్కవేడు శివారు గుంటూరుపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు పెద్దబ్బాయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా కలిసి పరామర్శించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షుడు నయీమ్, రామారావు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, అశ్రఫ్ పాషా, కొమ్ము రాజు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కేల్ పరిమాణంతో లెక్క చూసుకోవాలి

చెన్నారావుపేట : ముదిరాజ్ కులానికి చెందిన మత్స్యకార్మికులు చెరువులు, కుంటల్లో చేప పిల్లలు పోసే సమయంలో స్కేల్ ప్రకారం లెక్క చూసుకోవాలని ముదిరాజ్ మహాసభ జిల్లా యూత్ కన్వీనర్ కాట కుమారస్వామి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేదాది చేపపిల్లల పంపిణీలో జరిగిన అవకవతవకలపై ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరించారని గుర్తు చేశారు. సదరు వ్యక్తులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎక్కువ మొత్తంలో బురక పిల్లలు వచ్చి ముదిరాజ్ కులస్తులు నష్టపోయారని పేర్కొన్నారు. మళ్లీ అవినీతి జరుగకుండా చేప పిల్లలను పంపిణీ చేయాలని డీఎఫ్ఓను కోరామని చెప్పారు. పెద్ద చెరువులకు 80 ఎంఎం రూ.1.50 పైసలు), చిన్న కుంటలకు 35 ఎంఎం సైజు (65 పైసలు), అంతకన్న తక్కువ ఉంటే తీసుకోవద్దని తెలిపారు. స్కేల్‌ను కొలమానం చేసుకుని తీసుకోవాలని తెలిపారు. ఐక్యతతో నాణ్యమైన చేప పిల్లలను మాత్రమే తీసుకోవాలని కోరారు.

వైద్యం కోసం చేయూత

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మహబూబ్ పాషా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు ఉల్లెంగుల నర్సయ్య, చిర్ర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.